క్లుప్తంగా

గ్రామాభివృద్ధే ధ్యేయం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

యాలాల: గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని సర్పంచ్ సిద్రాల సులోచన అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 1వ వార్డులో సీసీరోడ్డు పనులు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీ నిధులతో సీసీ పనులు ప్రారంభించామని, గ్రామంలో ఇప్పటికే అవసరమైన చోట సీసీ, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి అంజయ్య, మౌలాన, బసప్ప, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా జీపీ భవన నిర్మాణం



అసంపూర్తి పనులతో జీపీ భవనం

తాండూరు రూరల్: చెన్‌గేస్‌పూర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఎన్ఆర్ఈజీఎస్ కింద నిధులు మంజూరైనప్పటికీ.. సదరు కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపివేశారు. దీంతో ఆ నిధులు వెనక్కి వెళ్లాయి. ఉన్నతాధికారులు స్పందించి.. జీపీ భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి, వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంధత్వ నివారణకు ‘కంటివెలుగు’



కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

పూడూరు: అంధత్వ నివారణకు ‘కంటివెలుగు’ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ మల్లేశం తెలిపారు. గురువారం మండల పరిధిలోని మేడికొండలో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేత్ర సమస్యలు ఉన్నవారికి వైద్యులు కంటి పరీక్ష చేసి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేఘమాల, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులు జగన్, కంటివెలుగు ఇన్‌చార్జి కర్ణాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు

పూడూరు: జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడానికి మంత్రి హరీశ్‌రావు వస్తుండగా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పలువురు బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేసి చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్, బీజేవైఎం పరిగి అసెంబ్లీ కన్వీనర్ రాజు, నాయకులు శ్రీశైలం, అనిల్, శేఖర్ ఉన్నారు. వ్యక్తిగత పూచికత్తుపై వారిని సాయంత్రం విడిచిపెట్టారు.

నేటి నుంచి సేవాలాల్ వార్షికోత్సవాలు

ధారూరు: సంత్ సేవాలాల్ మహరాజ్ 4వ వార్షికోత్సవ పూజలను ఈనెల 14వ తేదీ నుంచి 16 వరకు మండల పరిధి డీకేతండాలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేవాలాల్‌తో పాటు మరియమ్మ, అంబా భవానీ మాతకు సుప్రభాత సేవ, పూర్ణాహుతి, ప్రతిష్ఠాపన, అభిషేకం ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

వెయ్యి మందికి రంజాన్ కానుక



సరుకులు పంపిణీ చేస్తున్న ఎక్బాల్

అనంతగిరి: రంజాన్ పండుగను పురస్కరించుకొని వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సయ్యద్ ఎక్బాల్ పేద ముస్లిం కుటుంబాలకు గురువారం నిత్యావసరా సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవలో నిజమైన సంతృప్తి ఉందని, ఈ సారి సుమారు వెయ్యి కుటుంబాలకు సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

నామమాత్రంగా గ్రామసభలు

- కనిపించని ప్రజల భాగస్వామ్యం
- అవగాహన కల్పించని అధికారులు
- అసమర్థ పాలనతో కుంటుపడిన అభివృద్ధి!



దౌల్తాబాద్ గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ (ఫైల్)

దౌల్తాబాద్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యం లేక గ్రామాలు అభివృద్ధి చెందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే స్థానిక పాలకులు నామమాత్రంగా సభలు నిర్వహించి, చేతులు దులుపుకొంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

గ్రామ సభలతోనే ప్రగతి..

గ్రామాల అభివృద్ధిలో గ్రామసభలు ఎంతో కీలకం. ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు సభల్లో పాల్గొని సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారం కొరకు చర్చించడం ఆనవాయితీ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల వివరాల నమోదు గ్రామసభల ద్వారా నిర్వహిస్తారు. ప్రభుత్వాలు చేపట్టే కొత్త పథకాలు, పనులపై ప్రజల అభిప్రాయాలు ఈ సభల ద్వారానే తెలుస్తాయి. ఇంత ప్రాధాన్యత ఉన్న గ్రామసభలు నామమాత్రంగా కొనసాగడం గమనార్హం.

నిర్వహణ ఇలా..

గ్రామాల్లో ప్రతి రెండు నెలలకోసారి సభలు నిర్వహించాలి. పంచాయతీతో పాటు అనుబంధ గ్రామాల్లో సభలు నిర్వహించే తేదీని పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో దండోరా వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 17శాఖల అధికారులు.. గ్రామ జనాభాలో సుమారు 20శాతం మంది ప్రజలు సభకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అటువంటివేవీ కనిపించడం లేదని తెలుస్తోంది. కనీసం 50మందితో నైనా సభ ఏర్పాటు చేసుకోవాలనే నిబంధనలున్నా.. నామమాత్రపు సభలు ఏర్పాటు చేస్తున్నారని, పంచాయతీ ఆదాయ, వ్యయాలపైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపించాల్సి ఉన్నా అవేమీ చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఆసక్తి చూపని గ్రామస్తులు..

జిల్లాలోని చాలా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలకు కనీసం పది నుంచి ఇరవై మంది కూడా రావడంలేదు. ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు, వైద్యసిబ్బంది మాత్రమే వస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి విషయంలో ప్రజలకు నాయకుల మధ్య సమన్వయం లోపించింది. గ్రామసభల్లో చర్చిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపితే సభలకు ఆదరణ పెరిగే అవకాశం ఉంది. కానీ.. సమస్యలు పేరుకుపోతుండంతో సభలపై ఆసక్తి తగ్గుతుందని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యం పెరగాలి



గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింతగా పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులతో గ్రామాల్లో దండోరా వేయిస్తున్నాం. సమాచారం తెలుసుకొని ప్రజలు స్వచ్ఛందంగా సభకు రావాలి. తద్వారా ప్రజల, ఊరు సమస్యలు పరిష్కరించేందుకు వీలుంటుంది.

– తిరుమలస్వామి, ఎంపీడీఓ

విద్యపై దృష్టి సారించాలి

- విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి: జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ



కుల్కచర్ల: విద్యార్థులతో మాట్లాడుతున్న కోటాజీ

కుల్కచర్ల: విద్యార్థులు విద్యపై దృష్టి సారించి బాగా చదువుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ సూచించారు. గురువారం మండల పరిధి బండవెల్కిచర్ల, కుల్కచర్ల, రాంపూర్ గ్రామాల గిరిజన ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో రాయాలని చెప్పారు. పై తరగతులకు వెళ్తున్న క్రమంలో మన ఆలోచనలు ఉన్నతంగా ఉండాలని, దురలవాట్లకు దూరంగా ఉంటూ.. క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహాల ప్రత్యేకాధికారులు రాజు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి లోనుకావద్దు: ఎంఈఓ



దోమ: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

దోమ: ప్రతి విద్యార్థి ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. గురువారం జిల్లా పరిషత్, పాలేపల్లి పాఠశాలను ఆయన సందర్శించి, విద్యార్థులు రాస్తున్న ఎస్ఏ2 పరీక్షలను పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 24వ తేదీ వరకు విద్యార్థులకు మెమోలు అందజేయాలని ఉపాధ్యాయులకు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: మోమిన్‌పేట మాజీ సర్పంచ్ వడ్ల చంద్రయ్య, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రభు, బీజేపీ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, గోపాల్ రెడ్డిలు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మర్పల్లి ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు మహిపాల్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

దోమ: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. దోమ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య అనారోగ్యంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు స్థానిక సర్పంచ్ అంజిలయ్య బాధితున్ని ఆదుకోవాలని జెడ్పీటీసీ దృష్టికి తెచ్చారు. దీంతో జెడ్పీటీసీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి కింద రూ.లక్ష 25 వేలు మంజూరు చేయించారు. ఆ చెక్కును గురువారం పరిగి పట్టణంలోని ఆయన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోవర్దన్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణం చింత

- వాహనదారుల ఇక్కట్లు
- మూడు కి.మీ. రోడ్డుతో ముప్పతిప్పలు



రాజుపూర్–మోమిన్‌ఖుర్దు గ్రామాల మధ్య బీటీరోడ్డు

ధారూరు: ధారూరు మండలంలోని రాజుపూర్–మోమిన్‌ఖుర్దు గ్రామాల మధ్య బీటీరోడ్డు మూడు కిలో మీటర్ల మేర అడుకో గుంత, గజానికో గొయ్యిలా మారి.. అధ్వానంగా తయారైంది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మూడు కిలోమీటర్ల రోడ్డుతో ముప్పుతిప్పలు పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలా రోడ్డు దెబ్బతినడానికి నాసిరకమే కారణమని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపించారు. మెయింటెనెన్స్ కింద కాంట్రాక్టర్ రోడ్డు మరమ్మతు చేపట్టాల్సి ఉండగా.. కనీసం గుంతలను కూడా పూడ్చలేక పోతున్నారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతోనే రోడ్డు దుస్థితి ఇలా తయారైందని చెబుతున్నారు.

9 ఏళ్లుగా ఇలాగే..

ఈ మార్గం గుండా పరిగి పట్టణానికి వెళితే.. 14 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, రోడ్డు బాగలేకపోవడంతో.. ధారూరు, వికారాబాద్‌ల మీదుగా పరిగి వెళ్లాలంటే 40 కిలో మీటర్ల దూరభారం అవుతుందంటున్నారు. ధారూరు, రాజాపూర్ మీదుగా పరిగికి కేవలం 26 కిలో మీటర్లేనంటూ వెల్లడించారు. ఇలాంటి రోడ్డును 9 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. గుంతలమయమైన రోడ్డుతో వాహనదారులు నరకం చూస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును పునర్నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.91 లక్షలు మంజూరు: ఎంపీపీ

మోమిన్‌ఖుర్దు–రాజాపూర్ గ్రామాల మధ్య పాడైన రోడ్డును రీబీటీ వేయడానికి ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.91 లక్షలు మంజూరు అయ్యాయని ధారూరు ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి తెలిపారు. టెండర్ పనులు కూడా పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు.

టీఆర్ఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ



టీఆర్ఆర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పరిగి: డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి డాక్టరేట్ పొందడం పట్ల గురువారం పలువురు నాయకులు, ప్రజలు పట్టణ కేంద్రంలోని టీఆర్ఆర్ నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టరేట్ పొందడం ఎంతో సంతోషంగా ఉందని, ఉస్మానియ యూనివర్సిటీలో పీవీసీపై పీహెచ్‌డీ పూర్తి చేశానని తెలిపారు. అటవీ, వన్యప్రాణ సంరక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు చెట్లతో పని లేకుండా పీవీసీతోనే అన్ని పనులు జరిగేలా పరిశోధన చేశానన్నారు. సమాజ సేవ కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు జగన్, రామకృష్ణారెడ్డి, నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరుపుకోవాలి

పూడూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని బాబా సాహెబ్ విగ్రహం, పరిసర ప్రాంతాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ కుమార్, నాయకులతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల కో ఆర్డినేటర్ కాశయ్య, నాయకులు బుచ్చన్న, నర్సింహులు, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

కుల్కచర్ల: పోషకాలు తగ్గడం వలన ఐరన్ లోపించడం, రక్తహీనత తదితర సమస్యలు గర్భిణులను వెంటాడుతాయని, ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తడంతో పాటు.. పుట్టే బిడ్డలు అనారోగ్యంగా ఉంటారని కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్‌లు చెప్పారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 23మంది లబ్ధిదారులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకొని ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాజుద్దీన్, సీహెచ్ఓ చంద్రప్రకాష్, స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



వెంకట్రాములుకు తైబాజర్ హక్కు పత్రం అందజేస్తున్న డీఎల్‌పీఓ అనిత

కుల్కచర్ల: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎల్‌పీఓ అనిత అన్నారు. గురువారం గ్రామపంచాయతీలో తైబజార్ వేలం పాట నిర్వహించగా.. కుల్కచర్ల గ్రామానికి చెందిన పర్వపురం వెంకట్రాములు రూ.8,77,000లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. అభివృద్ధికి గ్రామం వనరుల నుంచి వచ్చే నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌమ్యారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు వెంకటేశ్, మైపాల్, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

17న సర్వసభ్య సమావేశం

యాలాల: ఈనెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి పుష్పలీల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించని సమీక్షలెందుకు?

- ఫైనలు లేకుండా.. అభివృద్ధి పనులు ఎలా చేయాలి?
- ‘కంటివెలుగు’ కార్యక్రమాలకు ఒక్క రూపాయి రాలె
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

కుల్కచర్ల: ‘ఎన్ని మీటింగులు పెట్టి మా గోడు చెప్పుకున్నా.. లాభం లేకుండా పోయింది. సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు’ అని సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు మాట్లాడారు. సమీక్షల్లో గ్రామాల సమస్యల గూర్చి ఎన్నిమార్లు చెప్పినా.. ప్రయోజనం లేదని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, కామునిపల్లి సర్పంచ్ మైపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. కంటివెలుగు కార్యక్రమానికి సంబంధించి ఒక్క రూపాయి రాలేదని, క్యాంపు నిర్వహణకు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందని ఘనపూర్ సర్పంచ్ విజయలక్ష్మి, దాస్యనాయక్ తండా సర్పంచ్ శంకర్ నాయక్ సభ దృష్టికి తెచ్చారు. చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితిలో తాము ఏవిధంగా కార్యక్రమాలు చేపట్టాలని వాపోయారు. ట్రాన్స్‌కో ఏఈ సభకు రాకపోవడాన్ని నిరసిస్తూ సభ్యులు మండిపడగా.. కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం సభను బైకాట్ చేశారు. ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడానికి మూడు సంవత్సరాలు తీసుకునే అధికారులతో అభివృద్ధి సాధ్యం కాదని ఆరోపించారు.

అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. సమీక్షలకు అధికారులు విధిగా హాజరుకావాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి శ్రద్ధచూపాలన్నారు. ప్రజాప్రతినిధులు తక్కువగా రావడం బాధాకరమని, వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని హాజరుకాకపోవడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, వైస్ ఎంపీపీ రాజశేఖర్, ఎంపీడీఓ నాగవేణి, తహసీల్దార్ రమేష్ కుమార్, డీఈ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మృతికి సంతాపం

చౌడాపూర్ ఎంపీటీసీ శంకర్ మృతి పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల శంకర్ ఎంతో చురుగ్గా ఉండేవారని గుర్తుచేస్తూ.. వారు లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గౌరవ వేతనం పెంచాలి

మర్పల్లి: గౌరవ వేతనం పెంచాలని వీఓఏలు గురువారం మంత్రి హరీశ్‌రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత వేతనం రూ.3,900లు కుటుంబ పోషణకు భారంగా ఉందని మంత్రికి చెప్పారు. స్పందించిన మంత్రి హరీశ్ సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు వీఓఏలు చెప్పారు.

◆ రంజాన్ కానుకల పంపిణీ

బొంరాస్‌పేట: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పంపిణీ చేసిన రంజాన్ కానుకలను గురువారం తుంకిమెట్లలో మండల మైనార్టీ ప్రెసిడెంట్ అనీఫ్.. ఇమామ్, మోజామ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇబ్రహీం, కరీం, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ కార్యకర్తలకు అండగా ఉంటాం

కొడంగల్: కార్యకర్తలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యకర్తలు, అభిమానులకు ఏ అవసరం వచ్చినా.. తమ కుటుంబం అందుబాటులో ఉంటుందని చెప్పారు.

◆ నేటి నుంచి అగ్ని మాపక వారోత్సవాలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొడంగల్: అగ్ని మాపక వారోత్సవాలు శుక్రవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు అగ్ని మాపక సిబ్బంది తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల గురించి, విద్యుత్ ద్వారా సంభవించే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

◆ టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావోత్సవం

అనంతగిరి: టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం వికారాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం కార్యాలయం ఎదుట యూనియన్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం ఉపాధ్యాయుల తరుపున ముందుండి పోరాడుతుందని చెప్పారు.

◆ క్రీడలతో మానసికోల్లాసం



బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పూడూరు: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి అన్నారు. గురువారం మేడికొండలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

◆ రేపటి నుంచి క్రికెట్ టోర్నీ

అనంతగిరి: ఈ నెల 15 నుంచి వికారాబాద్ డిస్ట్రిక్ట్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో పాండు మెమోరియల్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నామని క్లబ్ కోఆర్డినేటర్ విజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని మిషన్ గ్రౌండ్‌లో ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తామని, టోర్నీలో పాల్గొనే జట్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 63031 30622 నంబర్‌ను సంప్రదించాలన్నారు.